సాక్షి
తూర్పుగోదావరి
సోమవారం । 24 । జూన్ । 2024



రూ.1,01,116 విరాళం


సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని నిత్యాన్నదాన ట్రస్టుకు అప్పన చంద్రరావు (మలికిపురం మండలం గుడిమెళ్లంక) ఆదివారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



చుక్‌చుక్.. చకచకా

వీలైనంత వేగంగా కోనసీమ రైల్వే లైన్ పనులను పట్టాలెక్కించి, కోల్‌కతాతో అనుసంధానం చేయడమే లక్ష్యంగా ఆ శాఖ ముందడుగు వేస్తోంది. - 8లో▸

డెల్టాలకు 8,590 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 8,590 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,380, మధ్య డెల్టాకు 1,710, పశ్చిమ డెల్టాకు 4,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.70 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

జిల్లావ్యాప్తంగా భారీ వర్షం

కొవ్వూరు: జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. ఆదివారం ఉదయం 8.30 గంటలతో ముగిసిన 24 గంటల్లో జిల్లాలో 44.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. కోరుకొండలో గరిష్ఠంగా 78.4 మిల్లీమీటర్లు రికార్డయ్యింది. దీనితో పాటు రాజానగరం, సీతానగరం, గోకవరం, కడియం, గోపాలపురం, పెరవలి, తాళ్లపూడి, ఉండ్రాజవరం మండలాల్లో భారీ వర్షం కురిసింది. గడచిన రెండు రోజులుగా జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు ఖరీఫ్ పనుల్లో నిమగ్నమయ్యారు. అనపర్తిలో 28.4, బిక్కవోలు 5.8, గోకవరం 62.4, కడియం 55.2, రాజమహేంద్రవరం రూరల్ 14.4, రాజమహేంద్రవరం అర్బన్ 42.2, రాజానగరం 60.8, రంగంపేట 49.8, సీతానగరం 70.6, చాగల్లు 23.4, దేవరపల్లి 33.8, గోపాలపురం 58.4, కొవ్వూరు, నల్లజర్ల మండలాల్లో 25.2 చొప్పున, నిడదవోలు 31.2, పెరవలి 52.8, తాళ్లపూడి 68.8, ఉండ్రాజవరం మండలంలో 63.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. ఆదివారం ఉదయం నుంచి ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంది.

కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు అప్పారావుశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టికెట్లు, ఫొటోల అమ్మకంతో దేవస్థానానికి రూ.1,50,405 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్య ప్రకాష్ తెలిపారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2.02 లక్షల విరాళాలు



దాత కృష్ణారావుకు బాండ్ అందిస్తున్న రమణరాజు

ద్వారకా తిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు ఆదివారం వేర్వేరుగా రూ.2,02,232 విరాళాలు సమర్పించారు. నూజివీడుకు చెందిన వైవీ కృష్ణారావు రూ.1,01,116, గుంటూరుకు చెందిన ముప్వా భగవత్ ప్రసాద్, గంగాధరరావులు రూ.1,01,116 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతలకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ అందించి, స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు దేవాన్షి ఎంపిక



విజయవాడలో జరిగిన ఆర్చరీ పోటీల్లో పాల్గొన్న దేవాన్షి

కిర్లంపూడి: జాతీయ స్థాయి అండర్–10 ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలకు కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామానికి చెందిన ఆళ్ల దేవాన్షి ఎంపికైంది. ఓల్గా ఆర్చరీ అకాడమీ ఆధ్వర్యాన విజయవాడ శాతవాహన కాలేజ్ గ్రౌండ్‌లో శనివారం జరిగిన అండర్–10 స్టేట్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో కాకినాడ జిల్లా తరఫున పాల్గొన్న దేవాన్షి ప్రథమ స్థానంలో నిలిచి, గోల్డ్ మెడల్ సాధించింది. త్వరలో జరగనున్న జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో రాష్ట్రం తరఫున దేవాన్షి పాల్గొంటుందని ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ ఆదివారం తెలిపారు. చిన్నతనంలోనే ఆర్చరీలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న దేవాన్షితో పాటు తల్లిదండ్రులు లక్ష్మి, నానాజీకి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, పలువురు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

జోరు వానలోనూ లోవకు పోటెత్తిన భక్తులు

తుని రూరల్: రుతుపవనాల ప్రభావంతో తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తున్నప్పటికీ తలుపులమ్మ తల్లిని దర్శించేందుకు ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ జిల్లాల నుంచి 12 వేల మంది క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారని ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికార పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.2,49,595, పూజా టికెట్లకు రూ.70 వేలు, కేశఖండన శాలకు రూ.23,200, వాహన పూజలకు రూ.3,650, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలుగా రూ.91,062, విరాళాలు రూ.54,720 కలిపి దేవస్థానానికి మొత్తం రూ.4,92,227 ఆదాయం లభించిందని వివరించారు.

రైళ్లకు రెడ్ సిగ్నల్



- ఆధునీకరణ పేరుతో 26 ప్రధాన రైళ్ల రద్దు
- ఏడు వారాల పాటు వేలాది మంది ప్రయాణికులకు అవస్థలు
- రిజర్వేషన్ చేయించుకున్న వారికి తప్పని ఇక్కట్లు

రాజమహేంద్రవరం సిటీ: 'నేను ఎక్కవలసిన రైలు ఒక జీవిత కాలం లేటు' అని మహాకవి ఆరుద్ర అంటారు. ఆయన ఏ సందర్భంలో ఇలా అన్నా.. రైలు ఎప్పుడు వస్తుందో తెలియని నాటి దుస్థితికి ఈ మాటలు అద్దం పడతాయి. 'వాన రాకడ, ప్రాణం పోకడ ఎవరికి ఎరుక?' అని పెద్దలు తరచుగా అంటూంటారు. ఈ రెండు వ్యాఖ్యలు ప్రస్తుత రైల్వే పరిస్థితికి సరిగ్గా అతికినట్టుగా సరిపోతున్నాయి. ఆధునీకరణ పనుల పేరుతో ఇటీవల కొంత కాలం నుంచి రైల్వే శాఖ కొన్ని రైళ్లను ఎడాపెడా రద్దు చేసి పారేస్తోంది. దీంతో ఏ రైలు ఎప్పుడు నడుస్తుందో.. ఎప్పుడు రద్దవుతుందో తెలియక ప్రయాణికులు అయోమయానికి గురవుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్దామని ముందస్తుగా రిజర్వేషన్ చేయించుకుంటే.. తీరా ప్రయాణ తేదీ సమీపిస్తున్న తరుణంలో ఆ రైలును రద్దు చేశారనే చావు కబురును రైల్వే శాఖ చల్లగా చెబుతోంది.

ఆకస్మికంగా రద్దు

నిడదవోలు – కడియం స్టేషన్ల మధ్య ఆధునీకరణ పనుల పేరిట 26 ప్రధాన రైళ్లను ఆదివారం నుంచి ఆగస్టు 11వ తేదీ వరకూ రైల్వే అధికారులు రద్దు చేశారు. ఈ రైళ్లలో ఎంతో డిమాండ్ ఉన్న రత్నాచల్, జన్మభూమి, సింహాద్రి వంటి ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. ఈ రైళ్లలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని నిడదవోలు, కొవ్వూరు, రాజమహేంద్రవరం, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, పిఠాపురం, అన్నవరం, తుని స్టేషన్ల నుంచి వేలాదిగా ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తారు. ఈ రైళ్ల ఆకస్మిక రద్దుతో వీరందరూ ఆవేదన చెందుతున్నారు. దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో రెండో పెద్ద రైల్వే స్టేషన్‌గా రాజమహేంద్రవరం పేరు పొందింది. ఈ స్టేషన్ మీదుగా దేశంలోని వివిధ ప్రాంతాలకు ప్రతి రోజూ వందకు పైగా ప్రయాణికుల రైళ్లు రాకపోకలు సాగిస్తూంటాయి. వీటి ద్వారా ప్రతి రోజూ సుమారు 30 వేల మంది ప్రయాణిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రైల్వే స్టేషన్ మీదుగా నడిచే పలు రైళ్లను ఆధునీకరణ పనుల పేరిట ఏడు వారాల పాటు రద్దు చేయాలని రైల్వే అధికారులు ఆకస్మికంగా నిర్ణయించారు. ముఖ్యంగా విశాఖపట్నం, విజయవాడ వైపు నిత్యం రాకపోకలు సాగించే ప్రధాన రైళ్లను రద్దు చేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్, చెన్నై తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ముందుగానే రిజర్వేషన్ చేయించుకున్న వారు ఈ ఆకస్మిక రద్దుతో నానా యాతనా పడాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఆధునీకరణ చేయాలనే ప్రణాళిక ఉన్నప్పుడు ముందుగానే ప్రకటించి ఉంటే రిజర్వేషన్ల అవస్థలు తప్పేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధునీకరణ పనులకు అప్పటికప్పుడు నిర్ణయించుకుని రైళ్లను హఠాత్తుగా రద్దు చేయడమేమిటని నిరసన వ్యక్తం చేస్తున్నారు. రత్నాచల్, జన్మభూమి, డబుల్ డెక్కర్, సర్కార్ ఎక్స్‌ప్రెస్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉదయం, సాయంత్రం వేళల్లో వేలాది మంది ప్రయాణికులతో రాకపోకలు సాగిస్తూంటాయి. దీంతో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ కిటకిటలాడుతుంది. ముఖ్యమైన రైళ్ల రద్దుతో సుమారు ఏడు వారాల పాటు రైల్వే స్టేషన్ బోసిపోనుంది.

రద్దయిన రైళ్లు ఇవీ..

ఆదివారం నుంచి ఆగస్టు 11 వరకూ రద్దయినవి

- కాకినాడ పోర్టు – పుదుచ్చేరి – కాకినాడ పోర్టు స్టేషన్ల మధ్య నడిచే సర్కార్ ఎక్స్‌ప్రెస్ (17643/17644).
- మచిలీపట్నం – విశాఖపట్నం – మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17219/17220).
- గుంటూరు –రాయగడ (17243).
- విశాఖపట్నం – లింగంపల్లి (12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్.

సోమవారం నుంచి ఆగస్టు 10 వరకూ రద్దయినవి

- రాజమహేంద్రవరం–విశాఖపట్నం–రాజమహేంద్రవరం (07466/07467) ప్యాసింజర్.
- గుంటూరు – విశాఖపట్నం – గుంటూరు (17239/17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్.
- విజయవాడ – విశాఖపట్నం – విజయవాడ (12718/12717) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్.
- గుంటూరు – విశాఖపట్నం – గుంటూరు (22702/22701) ఉదయ్ ఎక్స్‌ప్రెస్.
- విశాఖపట్నం – తిరుపతి (22707) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్.
- విజయవాడ – కాకినాడ – విజయవాడ (17257/17258.

సోమవారం నుంచి ఆగస్టు 11 వరకూ రద్దయినవి

- రాయగడ – గుంటూరు (17244).
- లింగంపల్లి – విశాఖ (12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్.
- విశాఖపట్నం – మహబూబ్‌నగర్ (12862/12863) ఎక్స్‌ప్రెస్.
- వీటితో పాటు సోమవారం నుంచి ఆగస్టు 9 వరకూ తిరుపతి – విశాఖపట్నం (22708) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

ఆకస్మిక రద్దు దారుణం



ప్రయాణం కోసం చాలా రోజుల ముందే రిజర్వేషన్ చేయించుకున్నాం. ముందస్తు ప్రణాళిక లేకుండా ఇలా అకస్మాత్తుగా రైళ్ల రద్దు ప్రకటించడం దారుణం. ముందుగా ప్రకటించి, రద్దు చేసి ఉంటే ఏవిధమైన ఇబ్బందీ ఉండేది కాదు. రైళ్ల రద్దుతో సాధారణ, రిజర్వేషన్ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడతారు.

– మల్లికారెడ్డి, విశాఖపట్నం ప్రయాణికురాలు

దుర్మార్గం



విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాలకు నిత్యం ప్రయాణించే రైళ్లను అకస్మాత్తుగా రద్దు చేయడం దుర్మార్గం. దీనివలన నెలల ముందు రిజర్వేషన్ చేయించుకున్న వారు సైతం గమ్యస్థానం చేరడానికి అవస్థలు పడాల్సి వస్తోంది. ఆధునీకరణ చేయాలనుకుంటే ఆ విషయం ముందుగానే ప్రకటిస్తే రిజర్వేషన్ చేయించుకునేవారు కాదు.

– పి.పరమేష్, రైల్వే ప్రయాణికుడు

ప్రజల ఆరోగ్య పరిస్థితిపై క్షేత్ర స్థాయిలో సర్వే

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి



తొండంగి మండలం బెండపూడిలో మంచినీటి ట్యాంకును పరిశీలిస్తున్న డాక్టర్ పద్మావతి, అధికారులు

తొండంగి/కాకినాడ క్రైం: వాతావరణ మార్పులతో డయేరియా ప్రబలుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లోనూ ప్రజల ఆరోగ్య పరిస్థితిపై సర్వే చేయాలని వైద్య, ఆరోగ్య సిబ్బందిని ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ పద్మావతి ఆదేశించారు. మండలంలోని డయేరియా బాధిత గ్రామాలైన కొమ్మనాపల్లి, బెండపూడి గ్రామాల్లో ఆదివారం ఆమె పర్యటించారు. కొమ్మనాపల్లిలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు,, పీహెచ్‌సీ వైద్యులతో సమీక్షించారు. ఆయా గ్రామాల్లో డయేరియా బాధితుల ఆరోగ్య పరిస్థితిని ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 86 కేసులు నమోదు కాగా, 33 మందికి గ్రామంలోనే చికిత్స అందించామని, మిగిలిన వారిని తుని ఏరియా ఆస్పత్రి, కాకినాడ జీజీహెచ్‌లకు రిఫర్ చేశామని ఆయన వివరించారు. బాధితులు క్రమంగా కోలుకుంటున్నారని తెలిపారు. బెండపూడి గ్రామంలో పరిస్థితిపై కూడా డాక్టర్ పద్మావతి ఆరా తీశారు. వైద్యాధికారులు, గ్రామ ఎంఎల్‌హెచ్‌పీలు, గ్రామ పంచాయతీ అధికారులు సమన్వయం చేసుకుంటూ అన్ని గ్రామాల్లోనూ తాగునీటి పైపులైన్లను పరిశీలించాలని, కుళాయిల ద్వారా వచ్చే తాగునీటి శాంపిల్స్‌ను పరీక్షించాలని ఆదేశించారు. లోపం ఉన్నచోట సంబంధిత ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు పైపులైన్లకు మరమ్మతులు చేపట్టి, రక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో అనారోగ్యంతో ఉన్నవారిని ఆయా పీహెచ్‌సీలకు నివేదించి, ఎప్పటికప్పుడు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డయేరియా, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత, ఆహార నియమాలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నిల్వ మాంసం, చేపల విక్రయాలను నిషేధించాలన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ జె.నరసింహ నాయక్ మాట్లాడుతూ, ఆరోగ్య అత్యయిక స్థితి ఏర్పడితే కాకినాడలోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎపిడమిక్ సెల్ కంట్రోల్ రూమును 72071 18051, 70939 30574 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ జోన్–2 రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పద్మ శశిధర్, జెడ్ఎంవో డాక్టర్ రమేష్, డీసీహెచ్ఎస్ డాక్టర్ స్వప్న, డీఐవో డాక్టర్ రత్నకుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సరిత, పీహెచ్‌సీల వైద్యులు రవికుమార్, భారతి, కె.రవి, కె.అర్చన తదితరులు పాల్గొన్నారు.

పరమేశ్వరుడిని పూజిస్తే ఆయురారోగ్యాలు



వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారామ స్వామిని దర్శించుకుంటున్న నరసింహారావు

మండపేట: పరమేశ్వరుడిని పూజిస్తే ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని మహా సహస్రావధాని గరికిపాటి నరసింహారావు అన్నారు. మండపేట ధర్మం చెరువుగట్టు వద్ద సీతారామ కమ్మ కల్యాణ మండపంలో శివతత్వంపై మూడు రోజులపాటు జరిగిన ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శివుడిని ఎలా పూజించినా, ఏరకంగా వేడుకున్నా ఆయన కరుణా కటాక్షాలు సులభంగా లభిస్తాయన్నారు. మానవ సేవే మాధవసేవని, సాటివారికి, సహాయ పడేవారికి ఆ భగవంతుని ఆశీర్వాదం ఉంటుందన్నారు. ప్రవచనాలు విన్న వారంతా వాటిని పాటిస్తూ ముందుకు సాగాలన్నారు. శివపురాణంలో పేర్కొన్న వాటిని ప్రతి ఒక్కరూ పాటిస్తూ సత్ప్రవర్తనతో మెలగాలని ఉద్బోధించారు. చెడును వ్యతిరేకిస్తేనే సమాజంలో హింసాత్మక ధోరణి తగ్గుతుందన్నారు. భగవద్గీతలో సాక్షాత్తూ కృష్ణ భగవానుడే వీటిని బోధించారన్నారు. నేటి రాజకీయ పరిస్థితులు, నాయకుల తీరును పరోక్షంగా వివరిస్తూ చలోక్తులు విసురుతూ చేసిన ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

రారమ్మని.. చదువుకోమని

- వసతి గృహాల్లో చేరాలంటూ ప్రచారం
- జిల్లాలో 44 హాస్టళ్లలో 6,900 సీట్లు
- పేద విద్యార్థుల సంక్షేమానికి బాటలు



రాజోలు బాలుర హాస్టల్‌లో అడ్మిషన్ల ప్రక్రియ

రాయవరం: వసతి గృహాలు సిద్ధం అయ్యాయి.. రారమ్మని ఆహ్వానిస్తున్నాయి. పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలలతో పాటు సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ హాస్టళ్లలో విద్యార్థులు చేరేందుకు జిల్లా అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడ విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు, నాణ్యమైన విద్య అందిస్తున్నారు. చదువులో ప్రతిభ చాటాలంటే ఆరోగ్యవంతులుగా ఉండాలి. అలాంటి ఆరోగ్యం బాగుండాలంటే పోషకాలతో కూడిన సరైన ఆహారం తీసుకోవాలి. అందుకే ప్రభుత్వ వసతి గృహాల్లో మెరుగైన విద్యతో పాటు సౌకర్యాల కల్పనకూ యంత్రాంగం ప్రాధాన్యం ఇస్తోంది.

13 నుంచే ప్రారంభం

పాఠశాలలు ఈ నెల 13 నుంచి పునః ప్రారంభమైన విషయం తెలిసిందే. వీటితో పాటు హాస్టళ్ల తలుపులూ తెరుచుకున్నాయి. ఈ వసతి గృహాల్లో ఉంటూ విద్యాభ్యాసం చేసేవారికి డైట్, కాస్మెటిక్ చార్జీలను చెల్లిస్తారు. జిల్లాలో సోషల్ వెల్ఫేర్, బీసీ హాస్టళ్లు ఉన్నాయి. ఆయా హాస్టళ్లలో పనిచేసే వంటవారు పోషకాలు కోల్పోకుండా వంటల తయారీలో ప్రత్యేకంగా శిక్షణ పొందారు. కాస్మెటిక్ బిల్లుల వల్ల బాలికలు, బాలురకు తల నూనె, పౌడర్, దువ్వెన, సబ్బుల వినియోగానికి, బాలుర హెయిర్ కటింగ్‌కు ప్రయోజనం చేకూరనుంది.

జిల్లాలో పరిస్థితి ఇదీ

జిల్లాలో మొత్తం 21 బీసీ సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో 13 పోస్ట్ మెట్రిక్, ఎనిమిది ప్రీమెట్రిక్ హాస్టళ్లు. బాలికలకు ఆరు, బాలురకు ఏడు పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు ఉండగా, బాలురకు ఆరు, బాలికలకు రెండు ప్రీ మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లలో 1,300, ప్రీమెట్రిక్ హాస్టళ్లలో 800 మందిని చేర్చుకునేందుకు అవకాశముంది. అలాగే సాంఘిక సంక్షేమ హాస్టళ్లు 33 ఉన్నాయి. ఇందులో 10 పోస్ట్ మెట్రిక్, 23 ప్రీమెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. పోస్ట్ మెట్రిక్‌లో బాలికలకు ఐదు, బాలురకు ఐదు, ప్రీ మెట్రిక్‌లో బాలికలకు 11, బాలుర 12 హాస్టళ్లు ఉన్నాయి. మొత్తం 33 హాస్టళ్లలో 4,800 మంది విద్యార్థులను చేర్చుకునే అవకాశం ఉంది. వసతి గృహాల్లో విద్యార్థులను చేర్చుకునేందుకు సంక్షేమాధికారులు ఇంటి బాట పట్టారు. అలాగే కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రభుత్వ వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి సారించారు. గతంలోనే అన్ని బీసీ, ఎస్సీ వసతి గృహాలకు ఇన్వెర్టర్ సదుపాయాన్ని కూడా కల్పించారు.



ఆహ్వానం పలుకుతూ బీసీ వెల్ఫేర్ హాస్టల్ వద్ద ఏర్పాట్లు

వసతి గృహాల్లో నెలవారీ డైట్ చార్జీలు

తరగతి	బిల్లు (రూ.లలో)
3–4	1,150
5–10	1,400
ఇంటర్ ఆపై	1,600
కాస్మెటిక్ చార్జీలు 3–4 తరగతులకు	
బాలురు	125
బాలికలు	200
5–10 తరగతులకు	
బాలురు	150
బాలికలు	200
ఇంటర్ ఆపైన	
బాలురు	200
బాలికలు	250

ప్రచారం చేస్తున్నాం



పేద విద్యార్థులకు సంక్షేమ వసతి గృహాలు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. ఇక్కడ విద్యార్థులను చేర్చుకునేందుకు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నాం. వసతి గృహాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను కరపత్రాల ద్వారా తెలియజేస్తున్నాం. ఆయా వసతి గృహాల్లో ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు కృషి చేస్తున్నాం.

– ఎస్.సత్యనారాయణ, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి, అమలాపురం

ఏలేరు.. అడుగంటిన తీరు

పక్కనే కనిపిస్తున్న ఈ ఫొటో చూసి.. అదేదో కొండను ఎవరైనా దొలిచేస్తున్నారేమో అనుకునేరు! అలా అనుకుంటే పూర్తిగా పొరపాటే. ఇది సుమారు 54 వేల ఎకరాలకు సాగునీటిని అందించే ఏలేరు రిజర్వాయర్ ప్రస్తుత దుస్థితి ఇది. సుదీర్ఘ కాలం కొనసాగిన వేసవి.. తీవ్రమైన ఎండలు.. తగినంతగా వర్షాలు కురవకపోవడం వంటి కారణాలతో ఈ జలాశయం దాదాపు అడుగంటేసింది. కొద్ది రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తున్నా అవి ఎందుకూ కొరగావడం లేదు. సమృద్ధిగా వానలు లేకపోవడంతో ఎగువ నుంచి వస్తున్న నీరు (ఇన్‌ఫ్లో) అంతంత మాత్రంగానే ఉంటోంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 86.56 మీటర్లు కాగా, ఆదివారం 68.20 మీటర్లుగా నమోదైంది. జలాశయం సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా ఏకంగా 3.41 టీఎంసీలకు నీటి నిల్వలు పడిపోయాయి. ప్రస్తుతం ఆశించినట్టుగా వర్షాలు కురవకపోవడంతో నీటి నిల్వలు మరింతగా పడిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రిజర్వాయర్ నుంచి ప్రస్తుతం తాగునీటి అవసరాలకు 200, విశాఖకు 80 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. పంపా రిజర్వాయర్, తిమ్మరాజు చెరువుకు నీటి సరఫరా నిలిపివేశారు. ప్రాజెక్టు పరీవాహక ప్రాంతంలో 15 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

– ఏలేశ్వరం

ఏలేరు రిజర్వాయర్ గేట్ల వద్ద అడుగంటిన నీటి నిల్వలు



క్లుప్తంగా

శ్రీరుద్ర, శత చండీ యాగం ప్రారంభం



కేశనకుర్రుపాలెంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న పండితులు

ఐ.పోలవరం: కేశనకుర్రుపాలెం శ్రీరాజ రాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరుద్ర, శతచండీ, మహాసౌర యాగం కనుల పండువగా ప్రారంభమైంది. 12 రోజుల పాటు జరిగే ఈ యాగానికి ఆచార్యులుగా ఆగమవిశారద కాళ్లకూరి దుర్గా ప్రసాద్‌శర్మ, యాగబ్రహ్మ కాళ్లకూరి కామేశ్వర శర్మ, వెలవల్లి చంద్రశేఖర్‌శర్మ వ్యవహరిస్తున్నారు. పలువురు పండితులచే లోక కల్యాణార్థం, విశ్వశాంతిని కాంక్షిస్తూ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆలయంలో గణపతి పూజ, యాగశాల ప్రదక్షిణ, భూతబలి శాలాప్రవేశం, పుణ్యాహవచనం, మహన్యాసం, స్వామివారికి రుద్రాభిషేకం, క్షేత్రపాలక మండపారాధన, చండీ మండపారాధన, సూర్య నమస్కారాలు, శతసహస్ర బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు ఘనంగా జరిపారు. ఈ యాగాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ పేర్కొంది. ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ, వివిధ పుష్పాలతో అలంకరణలు ఆకట్టుకున్నాయి.

దుకాణాల్లో వరుస చోరీలు



అమీనాబాద్‌లో చోరీ చేస్తుండగా సీసీ కెమెరాలో నమోదైన దృశ్యం

కొత్తపల్లి: అమీనాబాద్, కొత్తపల్లి, ఉప్పాడలోని పలు షాపుల్లో శనివారం అర్ధరాత్రి వరుస చోరీలు జరిగాయి. ఉప్పాడలోని కిల్లీ షాపులో రూ.60 వేలు చోరీ చేశారు. కొత్తపల్లి ఊర చెరువు సెంటర్‌లోని కిల్లీ షాపులో పైరేకులను తొలగించి లోపల సామగ్రి, అమీనాబాద్‌లోని ఓ దుకాణంలో వస్తువులను దొంగిలించారు. అమీనాబాదులోని కిల్లీ దుకాణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో దొంగతనం చేసిన దృశ్యాలు నమోదయ్యాయి. దీని ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అనుమానితులు సంచరిస్తుంటే సమాచారం ఇవ్వాలని ఎస్సై స్వామినాయుడు అన్నారు.

చుక్‌చుక్.. చకచకా

- అమలాపురం టూ కోల్‌కతా
- 2029 నాటికి రైల్వే లైన్ పూర్తికి చర్యలు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ప్రణాళికను అందిపుచ్చుకుని పనులు
- రూ.220 కోట్లతో కోటిపల్లి–ముక్తేశ్వరం వంతెన గడ్డర్ల పనులు



దిండి - చించినాడ నడుమ వశిష్ట గోదావరిపై రైల్వే వంతెన పనులు

మలికిపురం: చుక్‌చుక్ బండి ట్రాక్‌లో పడుతోంది.. కోనసీమ వాసుల చిరకాల కోరిక త్వరలో తీరనుంది. వీలైనంత వేగంగా కోనసీమ రైల్వే లైన్‌ను కోల్‌కతాతో అనుసంధానం చేయడమే లక్ష్యంగా ఆ శాఖ ముందుకు సాగుతోంది. ఈ దిశగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యల ఆధారంగా కేంద్రం ముందుకు వచ్చి తగిన ప్రణాళిక చేపట్టింది. ఇందులో భాగంగా కోటిపల్లి– నరసాపురం రైల్వే లైన్‌లో ప్రధానమైన వంతెనలకు పిల్లర్ల నిర్మాణం పూర్తి కావొస్తున్న నేపథ్యంలో పిల్లర్లపై గడ్డర్ల నిర్మాణ ప్రక్రియకు రైల్వే శాఖ ప్రణాళిక చేస్తోంది. దాదాపు రూ.1,200 కోట్లతో కోటిపల్లి, నరసాపురం రైల్వే లైన్ పనుల్లో గోదావరి పాయలపై వంతెనల నిర్మాణం చురుకుగా సాగుతోంది. ఈ లైన్‌లో కోటిపల్లి– ముక్తేశ్వరం మధ్య గౌతమీ నది, బోడసకుర్రు– పాశర్లపూడి మధ్య వైనతేయ నది, దిండి– చించినాడ మధ్య వశిష్ట గోదావరి నదీ పాయలపై వంతెనల నిర్మాణం చేపట్టారు. పదేళ్ల నుంచి సాగుతున్న పనులు మరింత ఊపందుకున్నాయి. ఇప్పటికే 40 పిల్లర్ల వరకూ నిర్మించగా, కోటిపల్లి – ముక్తేశ్వరం వంతెన పిల్లర్లపై తాజాగా గడ్డర్ల పనుల కోసం రైల్వే శాఖ రూ.220 కోట్లతో టెండర్లు పిలిచి ఖరారు చేసింది. ఆ పనులు ప్రస్తుతం ప్రారంభ దశలో ఉన్నాయి. పాశర్లపూడి, దిండి వంతెనల పిల్లర్ల నిర్మాణం దాదాపు పూర్తి కావొస్తుంది. దిండిలో 20 పిల్లర్లకు గాను ఆఖరి పిల్లర్ పనులు ప్రారంభమయ్యాయి. కేంద్రం నుంచి నిధుల విడుదలలో జాప్యం కారణంగా గత ఏడాది పనులు కాస్త నెమ్మదిగా జరిగాయి. ఈ రెండు వంతెనల పిల్లర్ల నిర్మాణం కూడా వచ్చే ఏడాదికి పూర్తయ్యే అవకాశం ఉంది. దీంతో పాశర్లపూడి వంతెనపై గడ్డర్లకు రూ.180 కోట్లు, దిండి వద్ద వంతెన పిల్లర్లపై గడ్డర్ల నిర్మాణానికి మరో రూ.180 కోట్లతో టెండర్లు పిలిచేందుకు రైల్వే శాఖ సిద్ధమవుతోంది.

పూర్తయితే.. రవాణాకు సుగమం

రైల్వే అధికారుల మాట ప్రకారం 2029 నాటికి ఈ రైల్వే లైన్ పూర్తయితే కోల్‌కతాతో అమలాపురం అనుసంధానం అవుతుంది. ఇదే జరిగితే కోనసీమలోని ప్రధాన వ్యవసాయ, వాణిజ్య ఉత్పత్తుల రవాణాకు మార్గం సుగమమవుతుంది. ఇప్పటి వరకూ పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాల నుంచి వ్యవసాయ ఉత్పత్తుల రవాణా రోడ్డు మార్గం ద్వారా జరుగుతోంది. ఇక్కడి నుంచి రొయ్యలు, చేపలు, కొబ్బరి ఉత్పత్తుల రవాణా అధికంగా ఉంటోంది. రోజుకు 5 లక్షల టన్నుల రొయ్యలు, రెండు లక్షల టన్నుల చేపలు, 30 లక్షల టన్నుల కొబ్బరి కాయలు ఈ రెండు జిల్లాల నుంచి కేవలం కోల్‌కతాకు రవాణా అవుతుంటాయి. ప్రధానంగా లారీలపై వీటిని రవాణా చేస్తుంటారు. ఇలా ఆలస్యం కావడంతో పాటు, సకాలంలో అందక ఉత్పత్తులు దెబ్బతింటున్నాయి. అలాగే రవాణా ఖర్చులు అధికమవుతున్నాయి. ఫలితంగా రొయ్యలు, చేపల, కొబ్బరి సాగు రైతులకు గిట్టుబాటు కావడం లేదు. తొలుత అమలాపురం వరకూ లైన్ పూర్తయితే గూడ్స్ రైళ్లను అందుబాటులోకి తెస్తే వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతికి వెసులుబాటు ఉంటుందని రైల్వే శాఖ అధికారులు భావిస్తున్నారు.

2026 తరువాతే ట్రాక్, కల్వర్టులు

ప్రధాన వంతెనల పనులు ఇలా ఉంటే.. కోటిపల్లి నుంచి నరసాపురం వరకూ ట్రాక్ నిర్మాణం, పలు కాలువలు, డ్రైన్లపై వంతెనలు, కల్వర్టుల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. సుమారు 400 పైగా చిన్నా పెద్దా వంతెనలు, కల్వర్టులు నిర్మించాలి. ఈ ప్రక్రియ అంతా 2026 అనంతరం ప్రారంభించే అవకాశం ఉన్నట్లు రైల్వే వర్గాల సమాచారం. దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి చొరవతో కోనసీమ రైల్వే లైన్‌కు బీజం పడింది. ఆయన మరణానంతరం ఈ ప్రాజెక్టు మూలన పడినా ఎన్డీఏ ప్రభుత్వం హయాంలో కదలిక వచ్చింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కూడా పనులు చురుకుగా జరిగాయి. బాలయోగి తలపెట్టిన ప్రాజెక్టును తన హయాంలో పూర్తి చేయించాలని ఆయన తనయుడు, ప్రస్తుత ఎంపీ హరీష్‌మాధుర్ ఉన్నారు. కాగా రైల్వే ట్రాక్‌కు భూసేకరణ ఇంకా కొలిక్కి రాలేదు. ప్రధానంగా రాజోలు నియోజకవర్గంలో కొత్త అలైన్‌మెంట్ ప్రతిపాదించినా అధికారులు తగిన చర్యలు తీసుకోలేదు. దీనిపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉంది.

మృతురాలి ఆచూకీ లభ్యం



కొవ్వూరులో గుర్తు తెలియని మహిళ మృతదేహం

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రం వద్ద స్నానఘట్టంలో స్నానానికి దిగి నీట మునిగి శనివారం మృతి చెందిన మహిళ ఏలూరు సమీపంలోని కండ్రిగూడేనికి చెందిన బడిభట్ల పార్వతి (73)గా గుర్తించారు. పత్రికల్లో వచ్చిన వార్తలను చూసి ఈ ఘటన గురించి కుటుంబ సభ్యులు తెలుసుకున్నారు. అయితే వీఆర్వో పి.వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

- ఇదిలాఉంటే ఆదివారం గోష్పాద క్షేత్రం స్నానఘట్టం వద్ద మరో గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆమె ఎవరనేది ఇంకా తెలియరాలేదు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

జిత్ మోహన్‌మిత్రాకు పురస్కారం



జిత్‌మోహన్ మిత్రాను సత్కరిస్తున్న మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, హర్షకుమార్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రముఖ గాయకుడు, నటుడు, న్యాయవాది శ్రీపాద జిత్ మోహన్ మిత్రాకు అలనాటి అద్భుత గాయకుడు ముఖేష్ పేరుపై జీవిత సాఫల్య పురస్కారం లభించింది. రావు అండ్ రావు కళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న జిత్ మోహన్ మిత్ర కళా వేదికలో జరిగిన సభలో ఈ పురస్కారాన్ని నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పీవీఎస్ కృష్ణారావు, సూరపురెడ్డి తాతారావు మాట్లాడుతూ 73 ఏళ్లుగా జిత్ మోహన్‌మిత్రా నోట ముఖేష్ పాటలు వినిపిస్తున్నాయని అన్నారు. అలాంటి గొప్ప గాయకుడి పేరున జీవిత సాఫల్య పురస్కారాన్ని మరో అద్భుత గాయకుడు జిత్‌కు ఇవ్వడం సముచితమన్నారు. విశిష్ట అతిథులు మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, జీవీ హర్షకుమార్ మాట్లాడుతూ జిత్‌మోహన్‌మిత్రాకు ముఖేష్ జీవిత సాఫల్య పురస్కారం ఇవ్వడం ఆనందదాయకమన్నారు. అనంతరం పురస్కారాన్ని అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో దొండపాటి సత్యంబాబు, ముద్రగడ ఏసుబాబు, నూజిళ్ల సూరిబాబు, బి.సీతారామారావు, జె.శివ ప్రసాద్, వి.జగపతిరావు, రవీంద్రనాథ్ గిరి తదితరులు పాల్గొన్నారు.

ఐదు తరాలు.. అపురూప క్షణాలు



ప్రత్తిపాడులో వసంతయ్య, సూర్యకాంతం వివాహ వేడుకలో ఐదు తరాల అపురూప కలయిక

ప్రత్తిపాడు: ఐదు తరాలు ఒకచోట కలసిన వేళ.. వందకు పైబడి కుటుంబ సభ్యుల అపురూప కలయిక ఆనందడోలికే. ఏలేశ్వరం మండలం లింగంపర్తికి చెందిన బుగత వసంతయ్య (95), సూర్యకాంతం దంపతుల 75వ వివాహ వార్షికోత్సవం ఆదివారం ప్రత్తిపాడులో జరిగింది. నాటకరంగ కళాకారుడు, రైతు అయిన బుగత వసంతయ్యకు కుమారులు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత బంగార్రాజు, ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర అడ్‌హక్ కమిటీ కన్వీనర్ బుగత శివలతో పాటు మరో ఐదుగురు కుమార్తెలు సంతానం. వసంతయ్య కుమారులు, కుమార్తెలు, మనుమలు, మనుమరాళ్లు, ముని మనవళ్లు, ముని మనవరాళ్లు రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, కృష్ణా తదితర జిల్లాల్లో స్థిరపడ్డారు. మొత్తం 103 మంది కుటుంబ సభ్యులు ప్రత్తిపాడులోని బుగత శివ ఇంట జరిగిన ఈ వేడుకలో సందడి చేశారు. వసంతయ్య, సూర్యకాంతం దంపతులను సన్మానించి ఆనందంగా గడిపారు.

నర్తనం.. సమ్మోహనభరితం



అలరించిన కళాకారుల నృత్యాభినయం



సమ్మోహనంగా సాగిన నృత్య ప్రదర్శన

- ముగిసిన కళాసమ్మేళన్ పోటీలు
- విజేతలుగా 48 మంది కళాకారులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో నృత్యాభినయ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర, శ్రీరాధాకృష్ణ ట్రస్టు ద్వారా అంతర్జాతీయ సంగీత పోటీలు, ప్రదర్శనలు నాలుగు రోజుల పాటు రాజమహేంద్రవరం శ్రీవేంకటేశ్వర ఆనంకళా కేంద్రంలో నిర్వహించారు. నగరపాలక సంస్థ, గెయిల్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఈ కళాసమ్మేళన్ జరిగింది. భారతనాట్యం, కూచిపూడి, ఆంధ్రనాట్యం, గాత్రం, ఇన్‌స్ట్రుమెంట్స్ పోటీలలో 480 మంది కళాకారులు పాల్గొన్నారు. ఇందులో వివిధ విభాగాల్లో 48 మంది విజేతలుగా నిలిచారు. రోజూ 100 మంది కళాకారులు తమ ప్రదర్శనలు ఇచ్చారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ఈ కార్యక్రమాలు జరిగాయి. బెంగళూర్, చెన్నై, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మలేషియా, యూఎస్ నుంచి కళాకారులు హాజరయ్యారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను నిర్వాహకులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శివ స్వామి, రోషన్ గుప్తా, రాశి బలాసింగ్, కృష్ణభగవాన్, రాజ్‌కుమార్ వడియార్ తదితరులు పాల్గొన్నారు.

కనుల విందుగా ప్రదర్శనలు

నాట్యశాస్త్రంలో ఉన్న పదాలు, అదేవిధంగా కనుమరుగవుతున్న జావళీలను నేటి తరానికి అందించాలనే ఉద్దేశంతో శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర నృత్యకారులు సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. చల్లని సాయంత్రం వేళ కళాకారులు సంగీతానికి అనుగుణంగా నృత్యం చేసి వీక్షకులను రంజింపజేశారు.

సంప్రదాయాలను కాపాడడానికే..



కనుమరుగవుతున్న మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడడానికి నా వంతు కృషి చేస్తున్నాను. ఈ వేడుకల కోసం నెల రోజుల ముందు నుంచీ కళాకారులతో అభినయాలు చేయించాం. 150 మందితో 16,200 సార్లు 13 గంటల పాటు నిర్విరామంగా శ్రీకనకధార స్తోత్రం నృత్యాభినయానికి రాధాకృష్ణ కళాక్షేత్ర విద్యార్థులతో పాటు జి.ఉమశ్రీ, జి.లక్ష్మీదీపిక సహకారం అందించారు. నేటితరం యువత భారతీయ శాస్త్రీయ నృత్యానికి బదులు డ్యాన్స్ బేబీ డ్యాన్స్ అంటూ చిందులు వేస్తున్నారు. ఇది ఫ్యాషన్ అనుకుంటున్నారు. శాస్త్రీయ నృత్యానికి ఉన్న విలువను నేటి తరం తెలుసుకోవాలి. – డాక్టర్ జి.బదరీనారాయణ, రాధాకృష్ణ కళాక్షేత్ర నిర్వాహకుడు

బయో కెమికల్ వ్యర్థాల యూనిట్‌ను తరలించండి

రాజానగరం: బయో కెమికల్ వ్యర్థాలు సృష్టిస్తున్న కలుషిత వాతావరణంతో తమ గ్రామ ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని, తక్షణమే ఆ యూనిట్‌ను తొలగించాలని పల్లకడియం వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని, ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ చావా రమ్య విజ్ఞప్తి చేశారు. జీవ వైద్య సర్జికల్ వ్యర్థాలను కాల్చి బూడిద చేసే ప్లాంటును తమ గ్రామ శివారులో 20 ఏళ్ల కిందట ఏర్పాటు చేశారన్నారు. ఆ సమయంలో చిన్నపాటి యూనిట్‌గా ఏర్పాటు చేసి, ఇప్పుడు పంచాయతీ అనుమతులు కూడా పొందకుండా రెండెకరాలకు విస్తరించారన్నారు. దీనివల్ల గ్రామ శివారున ప్లాంట్ ఉన్నాగాని, అక్కడ కాల్చే వ్యర్థాల నుంచి వెలువడే దుర్వాసన, గాలులు తమ గ్రామస్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ శివారులో పేదలకు నివాస స్థలాలు ఇచ్చారని, ఇందులో కొంతమంది ఇళ్లు కట్టుకునే ప్రయత్నం చేశారని, కానీ ఆ ప్రాంతానికి కొద్దిదూరంలోనే ఈ బయో కెమికల్ వ్యర్థాల ప్లాంట్ ఉండడంతో దాని నుంచి వెలువడే దుర్వాసనలను భరించలేక ఇళ్ల నిర్మాణాలను కూడా ఆపేసుకున్నారన్నారు. ఈ ప్లాంట్‌లో బయో కెమికల్ వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయి కుళ్లి దోమలు, ఈగల ఉధృతి ఎక్కువవుతుందని అన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దృష్టికి కూడా తీసుకు వెళ్లామన్నారు.

పచ్చిరొట్టతో పుడమికి రక్ష

పాడి–పంట



పచ్చిరొట్ట ఎరువులు



జనుము పంట

- పెరగనున్న భూసారం
- అధిక దిగుబడులకు అవకాశం
- రసాయన ఎరువుల అవసరం తక్కువే
- ఆర్‌బీకేల్లో రాయితీపై విత్తనాలు లభ్యం

ఆలమూరు: పుడమిని కాపాడుకుంటే మనల్ని మనం రక్షించుకున్నట్లే.. మితిమీరిన రసాయన ఎరువుల వినియోగంతో భూసారం తీవ్రంగా దెబ్బతింటుంది. ఆధునిక పద్ధతుల కారణంగా పంటల సాగు యాంత్రీకమైంది. అధిక దిగుబడులు, పంట త్వరితగతిన వచ్చేందుకు మితిమీరిన రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం ఎక్కువైంది. దీనివల్ల ఆయా నేలల్లో పోషకాలు లోపించి సారం తగ్గిపోతుంది. నాణ్యమైన పంట ఉత్పత్తులు రాక మానవాళిని అనేక రుగ్మతలు పట్టిపీడిస్తున్నాయి. పంటల సాగుచేసే ముందు వీలైనంత మేరకు పచ్చిరొట్టను వేయడం ద్వారా నాణ్యమైన పంటలు, అధిక దిగుబడికి అవకాశం ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. దీనివల్ల భూమి కోల్పోయిన పోషకాలను తిరిగి పునరుద్ధరించుకునేందుకు దోహదపడుతోందని అంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 4.6 లక్షల ఎకరాల్లో వరి, అపరాల సాగు జరుగుతోంది. గత పుష్కర కాలం నుంచి మారిన వ్యవసాయ పద్ధతుల రీత్యా మూడో పంటకు అంతగా అవకాశం లేకుండా పోయింది. దీంతో రైతులంతా రసాయన ఎరువులపైనే ఆధారపడడంతో పెట్టుబడి పెరుగుతుండగా, దిగుబడి మాత్రం అంత ఆశాజనకంగా ఉండటం లేదు. ప్రస్తుతం పంట భూముల విషతుల్యానికి కారణమవుతున్న ఎరువులు, పురుగు మందుల నివారణకు కచ్చితంగా సంప్రదాయ పద్ధతుల్లో భూసారం పెంచాలన్న వ్యవసాయ నిపుణుల సూచనలను రైతులు పాటించేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో అనేక మంది రైతులు వీలైనంత మేరకు పచ్చిరొట్ట సాగుకు సమాయత్తమవుతున్నారు.

ఎక్కడ.. ఏం పెంచాలంటే..

పచ్చిరొట్టగా ఏ తరహా మొక్కలను పెంచాలన్నది మనం పంటలు పండిస్తున్న నేలపై ఆధారపడుతోంది. మొత్తంగా ఇలా పండించడానికి అనువుగా పదహారు రకాల మొక్కలు అందుబాటులో ఉంటాయి. అవి జీలుగ, అవిసె, జనుము, వెంపలి, అలసంద, పిల్లి పెసర, పెసర, మినుములు, గోడు చిక్కుడు, అజొల్లా, కానుగ, వేప, గ్లైరిసిడియా, జిల్లేడు, నేతల తంగేడు, కొండ మిరప మొక్కలను విత్తుకోవచ్చు. జీలుగ పంటను చౌడు భూముల్లో వేస్తారు. ఎకరానికి 10 నుంచి పన్నెండు కిలోల విత్తనాలను ఇసుకతో కలిపి పొలం అంతా చల్లుకోవాలి. పూత దశకు వచ్చాక కలియ దున్నితే ఎకరానికి 9 నుంచి 10 టన్నుల పచ్చి రొట్ట లభిస్తుంది. జనుమును అన్ని నేలల్లో పెంచవచ్చు. దీనిని పశువులకు మేతగా కూడా వాడవచ్చు. పిల్లి పెసరను చౌడు భూములు తప్ప వేరే నేలల్లో పండించవచ్చు. వీటన్నింటినీ పది కిలోల విత్తనాలు వేస్తే ఐదు నుంచి ఆరు టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. పెసర, మినుము పంటలను వేయడం వల్ల పశు గ్రాసంతో పాటు భారీగా పచ్చిరొట్ట లభిస్తుంది.

ప్రయోజనాలు ఇలా..

- పూత దశలో ఉన్న పచ్చిరొట్ట పైర్లను భూమిలో కలియ దున్నడం ద్వారా అవి భూమిలో కుళ్లిపోయి నత్రజని, భాస్వరం, పొటాషియం తదితర పోషకాలను అత్యధిక పరిమాణంలో అందిస్తాయి. దీనివల్ల నేల గుల్లగా మారి నీరు ఇంకే స్వభావం పెరుగుతుంది. నేలలో సూక్ష్మజీవులు పెరిగి జీవ రసాయనిక చర్యలు కూడా జరుగుతాయి. నేల సారం, ఉత్పాదకత సామర్థ్యం పెరుగుతుంది.
- భూమిలో చాలారకాల పోషకాలు అందుబాటులోకి వస్తాయి.
- పప్పు జాతి పంటలతో రైజోబియం బ్యాక్టీరియా పెరిగి ఎకరానికి 20 నుంచి 50 కిలోల నత్రజని అందుతుంది. కలుపు మొక్కలు పెరగకుండా ఇవి కాపాడతాయి. ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చు.
- భూమి లోతుల్లో ఉన్న పోషకాలను ఉపరితలానికి తీసుకొచ్చి, మొక్కలు వాటిని వినియోగించుకునేలా మారుస్తాయి.
- పచ్చిరొట్ట పశువుల మేతగా కూడా ఉపయోగపడుతుంది. తద్వారా పాడి పరిశ్రమ అభివృద్ధికి దోహదపడుతుంది.

సాగుకు విత్తనాలు ఇలా..

పంట	ఎకరాకు విత్తనం (కిలోలు)
జనుము	16 నుంచి 20
జీలుగు	12 నుంచి 16
పిల్లి పెసర	5 నుంచి 6
పెసర	6 నుంచి 8
మినుములు	6 నుంచి 8

భూసారం పెంపునకు మార్గం



వ్యవసాయ భూమిలో పచ్చిరొట్ట వేయడం వల్ల భూసారం అమాంతంగా పెరుగుతుంది. దీనివల్ల రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించే వీలుంటుంది. ప్రధాన పంటలు సాగుచేసే ముందు విధిగా పచ్చిరొట్ట వేస్తే చక్కని ఫలితం ఉంటుంది. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు లభిస్తున్నాయి.

–కె.నాగేశ్వరరావు, ఏడీఏ, ఆలమూరు